


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక - 205 బుధవారం 5 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ‘డిజిటల్ అరెస్ట్’ స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

**డిజిటల్ అరెస్ట్’ పేరుతో కొత్త తరహా మోసాలు**

**పోలీసులు, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎన్పీసీఐ సూచన**

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి**



**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**
దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, ‘డిజిటల్ అరెస్ట్’ పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) మిగతా 2లో...

## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

**డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం**

**రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు**

**నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం**



**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**
రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్...మిగతా 2లో...



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

**చెల్లిని గెంటేసిన నీచుడు కేటీఆర్**

**రహమత్ నగర్ రోడ్‌షోలో సీఎం రేవంత్**

**నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే**

**4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని హామీ**



హైదరాబాద్,**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)** జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ..
మిగతా 2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్ రైలును ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు... ఆరుగురి మృతి!

**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**



ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నేడు ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. జైరామ్‌నగర్ స్టేషన్ సమీపంలో ఒక ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు మరణించినట్లు భావిస్తున్నారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోర్బా ప్యాసింజర్ రైలు, ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్యాసింజర్ రైలు మొదటి బోగీ.. గూడ్స్ రైలు పైకి ఎక్కింది. ప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నష్టం అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

**న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఇసి**




న్యూఢిల్లీ,**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను ..మిగతా 2లో...

## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

**జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు**

హైదరాబాద్,**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు...మిగతా 2లో...



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ**

**పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ**

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**



2లో.

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖలు

**తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్**

**ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత**

**అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు**



2లో.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్**

**ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం**

హైదరాబాద్,**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది...మిగతా 2లో...



## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, **నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖలు

హైదరాబాద**నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**

ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ్ర÷ర్ అయ్యారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

### ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు

### జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత

ఆదిలాబాద్, **నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# ‘డిజిటల్ అరెస్ట్’ స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం కీలక సూచనలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఆదాయ పన్ను శాఖ అధికారులమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించింది.

**మోసం చేసే విధానం ఇదే...!**

ఈ ‘డిజిటల్ అరెస్ట్’ మోసంలో నేరగాళ్లు మొదట సాధారణ ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత బాధితులను నమ్మించడానికి వీడియో కాల్స్‌కు మారతారు. తాము ప్రభుత్వ అధికారులమని చెప్పి, బాధితులపై లేదా వారి కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్, డ్రగ్స్ రవాణా లేదా పన్ను ఎగవేత వంటి తీవ్రమైన కేసులు నమోదయ్యాయని బెదిరిస్తారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తూ బాధితుల్లో భయాన్ని సృష్టిస్తారు. వీడియో కాల్స్ సమయంలో నకిలీ యూనిఫాంలు, ప్రభుత్వ లోగోలు, పోలీస్ స్టేషన్ వంటి నకిలీ నేపథ్యాలను సృష్టించి బాధితులను పూర్తిగా నమ్మిస్తారు. అంతటితో ఆగకుండా, తాము చెప్పేది నిజమేనని భ్రమింపజేసేందుకు వెనుక వైపు అధికారిక కార్యాలయాల్లో వినిపించే శబ్దాలు వచ్చేలా చూసుకుంటారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు కొంత మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని బాధితులపై ఒత్తిడి తెస్తారు. “మీ పేరును కేసు నుంచి తొలగించడానికి”, “విచారణకు సహకరించడానికి” లేదా “రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్” వంటి మాటలు చెప్పి మోసపూరితంగా డబ్బులు బదిలీ చేయించుకుంటారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఎన్పీసీఐ సూచించింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎప్పుడూ ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపవని, డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తే, వెంటనే కాల్ కట్ చేసి వారి వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపింది. అనుమానాస్పద నంబర్ల నుంచి కాల్స్ వస్తే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, లేదా టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన ‘సంచార్ సాథీ’ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించింది. మోసగాళ్లతో జరిపిన సంభాషణలకు సంబంధించిన మెసేజ్‌లు, స్క్రీన్‌షాట్‌లను భద్రపరుచుకుంటే, ఫిర్యాదు చేసేటప్పుడు అధికారులకు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని ఎన్ పీసీఐ తన ప్రకటనలో వివరించింది.

## జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. ’పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

## మెంతా తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పంట

**తల్లాడ/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):**



తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో మెంతా తుఫాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న వరి పంట. గ్రామంలో రాయల నరసింహారావు అనే రైతు కి మోంథా తుపాన్ కారణంగా కురిచిన అకాల వర్షానికి తాను సాగు చేసిన 8 ఎకరాలు పొలం మొత్తం నీటి మట్టం అయినది ఏడతేరపు లేకుండా కురిచిన వర్షం కారణంగా చేతికి వచ్చిన వరి మొత్తం పాచి పోయి నీటి మట్టం అయింది అని 8 ఎకరాలు సాగు చేస్తే చేతికి వచ్చిన పంట చేయి దాటి పోయిందని కవులు కి తీసుకోని సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కవులు కూడా చెల్లించే పరిస్థితి లేదని కావున ప్రభుత్వం రైతన్నలు బాధలు గమనించి దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి తక్షణమే ప్రభుత్వ సహాయం దెబ్బతిన్న వరి పంట తుఫాను తీవ్రత వలన అన్నారుగూడెం గ్రామాల్లో వరి నేల వాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులను ప్రస్తుతం రైతులుపరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం విస్తృతంగా పరిశీలించి, ఎకరానికి తగిన నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది.

## మానవ హక్కులు మనిషి గౌరవాన్ని కాపాడుతాయి

### -హ్యూమన్ రైట్స్ సొసైటీ



**సత్తుపల్లి/నవంబర్4(జర్నలిస్ట్ వార్త)**



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో గంగారం ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అవినాష్ అధ్యక్షతన ఆశా కార్యకర్తలకు బహుజన అభ్యుదయ సేవా సమితి అనుబంధ సంస్థ అయిన హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మానవ హక్కులు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, లీగల్ మెట్రాలజీ యాక్ట్, వినియోగదారుల హక్కు చట్టాలను గూర్చి వివరించారు. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లలో వ్యక్తిగత ఫోటోలను షేర్ చేయవద్దని, డీపీ ఫోటోలని మార్చుకోవాలని కోరారు. ఆన్లైన్ లో మోసపోయామని తెలిసిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేయాలని చెప్పారు. అనంతరం నేషనల్ ప్రెసిడెంట్, లీగల్ అడ్వైజర్ ఇనపనూరి మహేంద్రనాథ్ మాట్లాడుతూ మహిళలను సాయంత్రం 6 గంటల తర్వాత గానీ, ఉదయం 6 గంటల లోపు గానీ పోలీసులు అరెస్ట్ చేయకూడదని, విచారణ నిమిత్తం మహిళలను స్టేషన్ కు పిలువకూడదని చట్టం చెబుతుంది. కావున చట్టాలను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ నేషనల్ జనరల్ సెక్రటరీ, వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్లిముంత వెంకటేశ్వరావు, రాష్ట్ర అధ్యక్షులు గోగుల వెంకటేశ్వరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జి పల్లెపాము డానియల్ బాల్య వివాహాలు, వృద్ధుల సంరక్షణ చట్టం, జీరో యఫ్ ఐ ఆర్ మొదలగు వాటిపై మాట్లాడారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు అవినాష్ హ్యూమన్ రైట్స్ సొసైటీ ద్వారా చేస్తున్న సామాజిక కార్యకమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ యన్ యం లు, హాస్పిటల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీల లో టాలెంట్ విద్యార్థుల ప్రతిభ..



**సత్తుపల్లి/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):**

సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి ముప్పాళ్ళ కావ్య సత్తుపల్లి సమితి స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి బహుమతి అందుకోవడం జరిగింది.

అదేవిధంగా పాఠశాల స్థాయిలో తెలుగు మీడియం నుంచి ముప్పాల కావ్య ప్రథమ బహుమతి, కొట్టె మౌనిష ద్వితీయ బహుమతి, చింతకింద హేమ సుహాసిని తృతీయ బహుమతిని, ఇంగ్లీష్ మీడియం లో ప్రథమ బహుమతి చిన్నంశెట్టి లాస్య శ్రీ, ద్వితీయ బహుమతి కలవకుంట్ల లక్ష్మీ ప్రసన్న, తృతీయ బహుమతి జక్కంపూడి తన్వీ, హిందీ మీడియం విభాగంలో ప్రథమ బహుమతి షేక్ ఆస్పియా, ద్వితీయ బహుమతి షేక్ హుస్సేన్ బి, తృతీయ బహుమతి షేక్ సుమయ కౌసర్ లు సాధించి సర్టిఫికెట్ మరియు షీల్డ్ లు బహుమతులు అందుకోవడం జరిగింది. విజేతలను టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది

# బీసీలకు 42% రిజర్వేషన్లు

## - తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి




**హనుమకొండ బ్యూరో/నవంబర్4 (జర్నలిస్ట్ వార్త):**బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని, వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ తహసీల్దార్ గారికి బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు విజ్ఞాపక పత్రం అందజేశారు. అలాగే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చేసిన హామీలను తక్షణం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదింపజేయడంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సామాజిక న్యాయానికి న్యాయం చేయాలని జేఏసీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమం ధర్మసాగర్ మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగింది.కోలా రమేష్ గౌడ్, పోలు వేణు కుమార్ ముదిరాజ్, అలగం రమేష్ పద్మశాలి, జి. ఎలాస్వామి మాదిగ, ఈ. రాజు మాదిగ, జి. శ్రీనివాస్ మాదిగ, కొట్టే బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

# పంట నష్టం అంచనా నివేదికను రెండు రోజుల్లో అందజేయాలి

## దెబ్బతిన్న రోడ్లకు వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలి - ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలు

**హనుమకొండ బ్యూరో / నవంబర్4 ( జర్నలిస్ట్ వార్త)**
ధర్మసాగర్, వేలేరు మండలాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, పశు సంపదను తక్షణం పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. పంట నష్టం అంచనా నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని, రైతులకు అనుకూలంగా వ్యవహరించాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాలపై శాఖల వారీగా చర్చించారు.

**రైతుల పట్ల లిబరల్‌గా ఉండాలి**
పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని శ్రీహరి పేర్కొన్నారు. పంట నష్టం నమోదు సమయంలో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టరాదని, లిబరల్‌గా వ్యవహరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ధాన్యం కొట్టుకుపోయిన రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

**ఇండ్లు కోల్పోయిన వారికి ఇండ్లు...**
పశువులు, ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ





ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.

**రోడ్లు వెంటనే బాగు చేయాలి**
ధర్మసాగర్, వేలేరు మండలాల్లో దెబ్బతిన్న పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ రోడ్లకు వారం రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దేవునూరు లెవెల్ కాజ్‌ను హై లెవెల్ కాజ్‌గా మార్చాలన్నారు. వాగులకు హద్దులు నిర్ణయించి విస్తరించాలని సూచించారు.

**వేలేరు%-%కొత్తకొండ రోడ్డుకు ప్రాధాన్యం**
వేలేరు%-%కొత్తకొండ మధ్య రోడ్డును బలోపేతం చేసి, కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. వేలేరు పాఠశాల సమీపంలో ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

**కలెక్టర్ స్నేహ శబరీష్ సూచనలు**
పంటలు, రోడ్లు, పశు సంపద నష్టం అంచనాలను త్వరగా అందజేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.
సమావేశంలో పాల్గొన్నవారు:
జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్డిఓ మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారాం, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ధర్మసాగర్, వేలేరు తహసీల్దార్లు సదానందం, కోమి, ఎంపీడీవోలు అనిల్ కుమార్, లక్ష్మీ ప్రసన్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, సాగునీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట నష్ట బాధితులను ఆదుకోవాలని రైతుల వేడుకోలు

## దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి - కలెక్టర్ స్నేహ శబరీష్

### దేవునూరు, ముప్పారం గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన





**హనుమకొండ బ్యూరో/ సెప్టెంబర్4 (జర్నలిస్ట్ వార్త):**
జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలు భారీ వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటలు నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టానికి తగిన పరిహారం అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్‌ను రైతులు వేడుకున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ దేవునూరు, ముప్పారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులను పరామర్శించి వారి సమస్యలు విన్నారు. "ప్రతి రైతు నష్టం వివరాలు వెంటనే నమోదు చేయాలి%॰% ప్రభుత్వం రైతు పక్షాన నిలుస్తుంది" అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల ప్రభావంతో వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వారీగా, సర్వే నంబర్ వారీగా పంట నష్టం వివరాలు యాప్‌లో నమోదు చేసి నివేదికలు త్వరగా సమర్పించాలని సూచించారు. దేవునూరులో వరి పొలాలు నీటమునిగిన ప్రాంతాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి పంటల నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. పలువురు రైతులు "మా పొలాల్లో వరద నీటితో పంటలు చెడిపోయాయి, వందల క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయింది" అని చెప్పగా, కలెక్టర్ వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు నష్టం అంచనా వేయమని ఆదేశించారు.ముప్పారం గ్రామంలో ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయని గుర్తించిన కలెక్టర్, "దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టండి. అంచనాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వండి" అని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.వర్షాల వల్ల సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం వరద నీటితో కొట్టుకుపోయినట్లు అధికారులు వివరించారు. పశుసంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలు కూడా కలెక్టర్ తెలుసుకున్నారు.తరువాత కలెక్టర్ ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించి, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, కెపాసిటీ తదితర వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డీఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఏవో రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**తల్లాడ/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):**ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం కల్పించిన అన్ని అనుమతులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డి ఎం అండ్ హెచ్ ఓ డి .రామారావు అన్నారు. మంగళవారం డిఎంహెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడలో శ్రీ సాయి బాలాజీ నర్సింగ్ హెూమ్ ను. ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ ను హాస్పటల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులతో కూడినఅవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలకు మరుగైన వైద్య సేవలు అందించాలని , సీజనల్ వ్యాధుల ప్రభలుతున్న తరుణంలో జాగ్రత్తలు పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట డాక్టర్ మహేష్, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల సూపర్వైజర్ కే. పెద్ద పుల్లయ్య, పలువురు సిబ్బంది ఉన్నారు.

# కాళేశ్వరం అభివృద్ధి పనులలో పురోగతి, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి /నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**
కాళేశ్వరం అభివృద్ధి పనులలో పురోగతి, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనిజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, కాటారం సబ్ కలెక్టర్, విద్యుత్, ఈఓ కాళేశ్వరం, డీపీఓ, సీపీఓ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్%-%1, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధి పనులలో అమలు వేగాన్ని పెంచాలని, నాణ్యత పర్యవేక్షణలో ఎక్కడా రాజీ పడరాదని ఆదేశించారు. పెండింగ్ పనులను సమయానికి పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తాజా అప్‌డేట్లతో, ప్రగతి నివేదికలు, అవసరాలు, పెండింగ్ సమస్యలు, అలాగే ఫీల్డ్ పనులకు సంబంధించిన ఫోటో డాక్యుమెంటేషన్ అందించేయాలి కలెక్టర్ స్పష్టం చేశారు.అధికారులతో సమన్వయంతో పనులను క్రమం తప్పకుండా పరిశీలించి, నాణ్యతగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారా సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇరిగేషన్, ప్రణాళిక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

## ప్రైవేట్ కళాశాలల బంద్ కు బీసీ సంక్షేమ సంఘం మద్దతు

### బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**నర్సంపేట/నవంబర్ 4( జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు చేస్తున్న బంద్ కు వరంగల్ జిల్లాలో బీసీ సంక్షేమ సంఘం మద్దతు ఉంటుందని వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో డ్యాగల శ్రీనివాస్



మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి విద్యార్థిని విద్యార్థులకు ఫీజు రియేంబర్స్ మెంట్ స్కాలర్షిప్పులు గత నాలుగు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడమే కాక గత నెలలో అసెంబ్లీ సాక్షిగా కళాశాలలకు, విద్యార్థులకు ఇచ్చిన మాట నిలుపుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యార్థులు కేవలం ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాల పైన ఆధారపడి చదువుతున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు. విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డ్యాగల శ్రీనివాస్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థలు చేస్తున్న కళాశాలల బంద్ కు వరంగల్ జిల్లాలో మా సంపూర్ణ మద్దతు ఉంటుందని డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, జిల్లా నాయకులు బోనగాని రవీందర్ పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, మోర్తాల రాంరాజ్, కందికొండ సురేష్, బోళ్ల రవీందర్, బిక్షపతి, శేషు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలి

## - బొంతు భాస్కరరావు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి

### కేంద్రాలు తెరిచారు - కాటాలు మరిచారు



**వేంసూర్/ నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోధాన్యం కొనుగోలు కేంద్రాలు తెలిసినప్పటికీ కాటాలు వేయటం లేదని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు ఆరోపించారు. రైతుల ఇబ్బందులను తెలియజేస్తూ తహశీల్దార్ మాణిక్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే తేమ శాతం పూర్తిచేసుకున్న ధాన్యం, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్నాయని, వాటిని కాటాలు వేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని పేర్కొన్నారు. తుపాను పై తుఫాన్ వస్తున్న ఈ తరుణంలో, ఎప్పటికప్పుడు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కాటాలు వేసి తరలించాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు విషయంపై తహశీల్దార్ స్పందించాలని కోరారు.

## మదెలయ్య స్వామి ఆలయానికి విరాళం



**రాయపర్తి?నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామంలో రజక కులస్తుల ఆరాధ్య దైవం మడేలయ్య స్వామి గుడి మౌలిక వసతుల కల్పనకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి 20 వేల రూపాయలను మంగళవారం అయల కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ,ఫౌండేషన్ ప్రతినిధిలు లేతాకుల మధుకర్ రెడ్డి, లేతాకుల మహేందర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, నరేష్ నాయుడు, కోలా సంపత్, సంకినేని ఎల్లస్వామి, సురేందర్ రెడ్డి,గూడెల్లి వెంకటయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుంతల రోడ్ల పై ప్రయాణం...

## బస్సుల్లో విపరీత రద్దీ..



**సత్తుపల్లి/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):**
ఉచిత బస్ సర్వీస్ లతో ఆర్టీసీ లలో మహిళ ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. పరిమితి కి మించి ప్రయాణికులు బస్ లలో ప్రయాణం చేయడం ఒకటి అయితే రహదారుల్లో ఉన్న గోతులమధ్య బస్ లు నడపాలంటే డ్రైవర్లు భయం తో బిక్కు బిక్కుమంటున్నారు. కొత్తగూడెం, కోదాడ, ఇల్లెందు,సత్తుపల్లి, అశ్వారావుపేట వంటి మార్గాలలో గుంతల రోడ్లు, కొన్ని చోట్ల ఇరుకు రహదారుల వల్ల ప్రయాణం భయంకరంగా మారిందని ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు. బస్ లలో విపరీత రద్దీ,లారీలు, ఇతర వాహనాలు నిరంతరం తిరుగుతుండటం తో విపరీత ట్రాఫిక్ వలన డ్రైవర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జరుగుతున్న ప్రమాదాలు చూసి అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న రహదారులను మరమ్మతులు చేయాలనీ, ప్రజలు, ప్రయాణికులు కోరుచున్నారు.

## నంది అవార్డు అందుకున్న మేకల పద్మ




**ఖమ్మం/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):**
విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అవార్డు ప్రోగ్రాం మన నేచర్ యానిమల్ కేర్ సెంటర్ ఖమ్మం మధురానగర్ మేకల పద్మ యాదవ్ చేస్తున్న సేవలను గుర్తించి విశ్వజనని ఫౌండర్ బొగ్గవరపు బ్రహ్మానందం , బంగారపు నంది అవార్డు అందజేయడం జరిగినది ఇంకెన్నో సేవా కార్యక్రమం చేయాలని బ్రహ్మానందం అభినందించారు నేచర్ యానిమల్ కేర్ సెంటర్ ఫౌండర్ పద్మ మాట్లాడుతూ ఈ సన్మానాలు ఈ గౌరవం అన్ని నా తల్లిదండ్రులకు చెందాలని కోరుకుంటున్నాను

# కూలీ తల్లిదండ్రుల కుమారుడికి డాక్టరేట్ గౌరవం



ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు శేఖర్ మాదిగ (ఫైల్ ఫోటో)

## సామాజిక న్యాయ సాధనకు విద్యను ఆయుధంగా మలిచిన శేఖర్ మాదిగ

## ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ బిరుదు పొందిన కొమ్ము శేఖర్ మాదిగ

## పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ పరిశోధనకు విశ్వవిద్యాలయం గుర్తింపు



ఉస్మానియా యూనివర్ సిటీ నాయకుడు శేఖర్ ను డాక్టర్ పట్ట అందిస్తూ అభినందనలు తెలుపుతున్న పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ



ఉద్యమం చేస్తున్న సందర్భంగా పోలీస్ లు తీసుకెళ్తున్న దృశ్యం



తండ్రి అంజయ్య తల్లి సరోజన తో విద్యావేత శేఖర్ మాదిగ

**హైదరాబాద్ బ్యూరో/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):** సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ మాదిగ విద్యార్హతల శిఖరాన్ని అధిరోహించారు. సాధారణ కూలీ కుటుంబంలో పుట్టి కష్టాన్ని కర్మగా మలుచుకున్న ఆయన, విద్యతో తన జీవితాన్ని మార్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డాక్టరేట్ బిరుదు అందుకోవడంతో ఆయన కుటుంబం, గ్రామ ప్రజలు, విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### తెలంగాణ అర్బన్ గవర్నెన్స్‌పై విశ్లేషణాత్మక పరిశోధన

ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధన అంశం %–
%కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్‌బీ ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్.
ఈ పరిశోధనలో పట్టణ పాలనలో ప్రజాప్రతినిధుల సామర్థ్యాభివృద్ధి, పాలన పట్ల అవగాహన పెంపు అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు. ఈ కృషికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ బిరుదు ప్రదానం చేసింది.

### ఎంఎస్‌ఎఫ్ నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధి వరకూ ప్రయాణం

విద్యార్థి దశ నుంచే సామాజిక చైతన్యం కలిగిన శేఖర్, మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో కీలక నాయకుడిగా ఎదిగారు. ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడిగా, పలు జిల్లాల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. విద్యార్థి ఉద్యమాల ద్వారా సామాజిక న్యాయ సాధనకు కట్టుబడి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సేవలందిస్తున్నారు.

### కూలీ తల్లిదండ్రుల కుమారుడు నుంచి విద్యా శిఖరానికి

తన తండ్రి అంజయ్య, తల్లి సరోజలు కూలీ పనులతో కుటుంబాన్ని పోషించినప్పటికీ, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారు. ఐదవ తరగతి వరకు స్వగ్రామంలో, తర్వాత ఎల్‌బీ నగర్, ఇబ్రహీంపట్నం, నిజాం కాలేజీ, ఓయూ ఆర్ట్స్ కాలేజీలలో చదువుకుంటూ క్రమంగా ఉన్నత విద్యను సంపాదించారు. విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా, సామాజిక మార్పు సాధనంగా భావించారు.

### తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ముందువరుసలో


డిగ్రీ చదువుతున్న సమయంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా నడుస్తున్నప్పుడే ఆయన విద్యార్థి నాయకుడిగా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆర్ట్స్ కాలేజీ పీజీ చదువుతున్న సమయంలో ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి విద్యార్థుల్లో ఆత్మగౌరవం, సామాజిక స్పృహ కలిగించారు.

### స్ఫూర్తి వ్యక్తికి కృతజ్ఞతలు

డాక్టరేట్ బిరుదు అందుకున్న అనంతరం తన స్ఫూర్తి దాత పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ వై. పార్థసారథి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధ్యాపకులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

### అభినందనల వర్షం

డాక్టరేట్ బిరుదు సాధనతో శేఖర్ మాదిగపై అభినందనల వర్షం కురుస్తోంది. ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకవర్గం, విద్యార్థి సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు శేఖర్‌ను అభినందిస్తూ, ఆయన విద్యా సాధన యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యతో సాధించగల సామాజిక న్యాయం శాశ్వతం అవుతుంది" అనే నమ్మకంతో, శేఖర్ మాదిగ తన జీవితాన్ని అంకితం చేశారు
కూలీ తల్లిదండ్రుల కుమారుడి నుండి విద్యా శిఖరానికి చేరుకున్న ఈ విజయం ప్రేరణాత్మకం!



ప్రొఫెసర్ పార్థసారథి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న కొమ్ము శేఖర్ మాదిగ...



మందకృష్ణ మాదిగ తో కలిసి ఉద్యమ జెండా మోస్తున్న శేఖర్ మాదిగ

---

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం

## అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం

## హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం

**/వరంగల్,హైదరాబాద్,నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# జోనల్ లెవెల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ కు సర్వం సిద్ధం

**-ఈనెల 6 నుండి 8 వరకు జరగనున్న 11వ జోనల్ క్రీడా పోటీలు.**



**రాయపర్తి/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 6 నుండి 8 జరగబోయే 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ కు కావలసిన ఏర్పాటన్ని సర్వం సిద్ధమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వీటికి సంబంధించిన ఏర్పాట్లను కళాశాల పీడీ,పీఈటీ లు పరిశీలించారు. ఈ క్రీడా పోటీలకు 14 పాఠశాల నుండి 1190 మంది విద్యార్థులు ఈ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు గ్రౌండ్ తో పాటు కావలసిన అన్ని అవసరాలను పూర్తి చేసినట్లు తెలిపారు. దీనిని జెడ్ వో విద్యా రాణి,డిసిఓ అపర్ణ జోనల్ కు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నరన్నారు.

# కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా మద్దిశెట్టి నియామకం

**భద్రాద్రి కొత్తగూడెం/నవంబర్4 (జర్నలిస్ట్ వార్త):**
భారతీయ యువసేవ సంఘం నుంచి మద్దిశెట్టి సామేలు కి కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా అరుదైన అవకాశం లభించింది. ఈ నియామకం భారతీయ యువసేవ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీ జి. రోషన్ గుప్తా సూచనల మేరకు జరిగింది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి చెందిన మద్దిశెట్టి కి ఈ గౌరవం దక్కడం రాష్ట్రానికి గర్వకారణం.
నేషనల్ ఫౌండర్ శ్రీ భరణి బాలకృష్ణన్,నేషనల్ ప్రెసిడెంట్ రోషన్ గుప్తా ,నేషనల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌరవ్ దాస్ గ. నేషనల్ సెక్రటరీ షేక్ షావలి
మరియు మిగతా కోర్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం అమరులైన అమరవీరులకు విప్లవ జోహార్లు.




**బయ్యారం/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):**
అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 4 న బాలాజీ పేటలో అమరుడు కామ్రేడ్ ఎర్రమళ్ళ ఎర్రన్న సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి అమరుడు కామ్రేడ్ ఎర్రన్న స్మారక స్తూపం పై పార్టీ గ్రామ కార్యదర్శి కొత్త రామదాసు జెండా ఆవిష్కరించగా సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ బయ్యారం మండల కమిటీ సభ్యుడు గుడిబోయినరమేష్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు తోకల వెంకన్నలు మాట్లాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సమ సమాజ స్థాపన ఏర్పడుతుందని,దున్నే వాడికే భూమి లభిస్తుందని అన్నారు. రాజకీయ సామాజిక,సంస్కృతిక అసమానతలు లేని సమాజం కోసం ఎందరో విప్లవ విప్లవయోధులు త్యాగదనులు తమ తుది శ్వాస వరకు పోరాడి ఆత్మ బలిదనాలు చేసిన అమరవీరులకు వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి త్యాగాలబాటలో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతిఘటన పోరాటాలను ఉధృతం చేయాలని,ప్రజాయుద్ధ పందా, సాయిధ తిరుగుబాటు ద్వారానే సమ సమాజం సాధ్యమని ఆ మార్గంలో ప్రయాణించాలని అప్పుడు మాత్రమే అమరవీరులకు నిజమైన నివాళులర్పించిన వారం అవుతమని అన్నారు. ఈ సభలో రామచంద్రుల మురళి బండి ప్రభాకర్,ఎర్రమళ్ళ పెద్ద వెంకన్న,కుషిని వెంకన్న,భూక్యాగ్యామ, నిమ్మరబోయిన సహదేవ్,ఈడ పోయిన వీరభద్రం,భూక్య నాగేశ్వరరావు,లావుడియా గోవర్ధన్, బోడ కృష్ణ,ఎన్ని సురేష్,కొత్త అశోక్, కొత్త రాంబాబు, అల్లి వెంకన్న, ఈడబోయిన రామచంద్రు, ఏర్ని అచ్చుమ్మ, గుడిబోయిన వినోద, సురబోయిన లక్ష్మీనారాయణ,బైగల్ల శ్రీను, పసునూటి మురళి,గుగులోత్ రామారావు,ఇస్లావత్ భీమ్లా. తదితరులు పాల్గొన్నారు.

## మెగా స్పెషల్ లోక్ అదాలత్.

### వివాదాలా..? లేక రాజీలా..?మీరే నిర్ణయించుకోండి.

### -ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్.

**బయ్యారం/నవంబర్ 4( జర్నలిస్ట్ వార్త):**



గొడవలు వద్దు %-% రాజీలు ముద్దు,వివాదాలు పెంచుకుంటే జీవితకాలం కొనసాగుతాయని, రాజీ మార్గంలో "ఇంతటితో కలిసిపోదాం" అని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే కేసులకు లోక్ అదాలత్ ద్వారా స్వస్తి చెప్పవచ్చని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4నుండి 15 వరకు మహబూబాబాద్ కోర్టులో "మెగా స్పెషల్ లోక్ అదాలత్" నిర్వహించబడుతుందని తెలిపారు. మీపై కానీ, మీకు తెలిసిన వారిపై కానీ ఉన్న వివాదాస్పద కేసులను కోర్టుకు హాజరై రాజీ (కాంప్రమైజ్) చేసుకుంటే, ఆ కేసులు పూర్తిగా క్లోజ్ చేయబడతాయని సూచించారు.

## రామాలయంలో తులసి దామోదర కళ్యాణ మహొత్సవం

**గణపురం/నవంబర్4 (జర్నలిస్ట్ వార్త):**



గణపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా 5వ తారీఖు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు తులసి దామోదర కళ్యాణ మహొత్స వం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ తెలిపారు కార్తీక పౌర్ణమి సందర్భంగా ముందుగా ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూలా శ్రీనివాస్ గౌడ్ బటిక స్వామి బూర రాజగోపాల్ మాదాసు అర్జున్ మాదాసు మొగిలి ఉయ్యాల బిక్షపతి మోటాపోతుల రాజన్న గౌడ్ గోరంట్ల రాజన్న గుప్తా తదితరులు భక్తులు పాల్గొన్నారు.

## రెడ్డిగుడిలో కార్తీక దీపోత్సవానికి భక్తుల విరాళాల వర్షం

**గణపురం/నవంబరు4(జర్నలిస్ట్ వార్త):**



మండల కేంద్రంలోని చారిత్రక కాకతీయుల కళాక్షేత్రం శ్రీ నాగలింగేశ్వరాలయం రెడ్డిగుడిలో మంగళవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలతో ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రానికి చెందిన సూర్యదేవర స్రవంతి కార్తీక్ దంపతులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి 15 లీటర్ల నూనె, 516 మట్టి ప్రమిదలను, దీపధూప పూజాసామగ్రి అందజేశారు. అదేవిధంగా వెలిశాల విజయలక్ష్మి పట్టాభి కుటుంబం కూడా 15 లీటర్ల నూనె, పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. అదేవిధంగా వంతెనగిరి ఉష అశోక్ దంపతులు 365 మట్టి ప్రమిదలను అందించి కార్యక్రమానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపోత్సవం సందర్భంగా ఆలయం పరిసరాలు దీప ప్రకాశంతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం.

### -ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్కే.మదార్.

**బయ్యారం/నవంబర్ 4( జర్నలిస్ట్ వార్త):**
నవంబర్1నుండి9వరకు అమరవీరుల సంస్మరణ సభలు జరపాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం బయ్యారం మండలం గురిమెళ్ళ గ్రామంలో బట్టు అంజన్న(సురేషన్న) సైదులన్న స్మారక స్థూపంపై పార్టీ గ్రామ కార్యదర్శి తోలెం నర్సన్న జెండా ఆవిష్కరించి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు.



అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టియు)రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్కే. మదార్ పాల్గొని మాట్లాడుతు భారత విప్లవోద్యమ చరిత్రలో అనేక మంది కమ్యూనిస్ట్ విప్లవకారులు విప్లవోద్యమ నిర్మాణం కోసం,ప్రజల కోసం తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు. నవంబర్ నెలలోనే కమ్యూనిస్టు విప్లవకారులైన అగ్రశ్రేణి నాయకులు,కార్యకర్తలు అమరులైనారని అన్నారు. మార్క్సిజం,లెనినిజం,మావో ఆలోచనా విధానాన్ని మార్గదర్శకంగా తీసుకొని నక్సల్బరి,శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయని,ఈ పోరాటాల ప్రభావంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో గోదావరి లోయ విప్లవోద్యమానికి పునాదులు వేశారని,ఈ విప్లవోద్యమ స్ఫూర్తితో అనేక మంది ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజల తరపున నిలబడి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారని అన్నారు. ప్రభుత్వం ఉద్యమాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని అనేక కుట్రలు పన్ని ఎంతోమంది విప్లవకారులను నిర్దాక్షిణ్యంగా,క్రూరంగా కాల్చి చంపిందని అన్నారు. విప్లవకారుల నాయకత్వంలో పది లక్షల ఎకరాలకు పైగా పొడు భూములను ప్రజలకు సాధించి పెట్టిన చరిత్ర కమ్యూనిస్టు విప్లవ కారులకు ఉందన్నారు
అమరవీరులను స్మరించుకుంటు సంస్మరణ సభలు జరుపుకోవడం అంటే వారి త్యాగాలను,ఆశయాలను ముందుకు తీసుకు వెల్లడమే. అమరవీరులను స్మరించుకుంటూ ప్రతిఘటన ఉద్యమాలను నిర్మించినప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారం అవుతామని వారు అన్నారు. గ్రామ,గ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు జరుపాలని పార్టీ శ్రేణులకు,ప్రజలకు మాదార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ,ప్రజా సంఘాల మండల,జిల్లా నాయకులు తోలెం కార్తీక్,నవీన్,సమ్మయ్య,వీరన్న,భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం వ్యవసాయ తనిఖీ కేంద్రంలో రైతుల నుండి సిబ్బంది చేతి వాటం.



**బయ్యారం/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):**
ఆరుగాలం శ్రమించి కష్టపడి పని చేసిన రైతుకు బయ్యారం వ్యవసాయ మార్కెట్ తనిఖీ కేంద్రం సిబ్బంది తనిఖీల పేరుతో చాలా ఇబ్బంది పెడుతున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. మంగళవారం ఇల్లందు నుండి బయ్యారం వస్తున్న పత్తి లోడ్ చేసుకుని బొలెరో వాహనాలను బయ్యారం వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద సిబ్బంది నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వాహనానికి 1000 నుంచి 2000 రూపాయలు చెస్ కట్టాలంటూ వాహనాలను ఆపి సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తూ ఇబ్బందులు గురి చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేరుగా రైతులు పత్తిని మిల్లులకు తీసుకొని వెళ్ళిన తర్వాత మ్యాచర్ పేరుతో మిల్లు వారు పత్తిని రిజెక్ట్ చేస్తే రైతులు చెస్ కట్టి నష్టపోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బయ్యారం వ్యవసాయ తనిఖీ కేంద్రం సిబ్బంది తీరుపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



## శస్త్ర పబ్లిక్ స్కూల్ లో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



**హుజురాబాద్/నవంబర్ బీ(జర్నలిస్ట్ వార్త):** హుజురాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్ లో ముందస్తు కార్తీక పౌర్ణమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు దీపాలు వెలిగించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వార తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు, పండగ యొక్క విశిష్టత తెలుస్తుందన్నారు. విద్యార్థులతో కలిసి పండుగ వేడుకలు జరుపుకోవడం వల్ల సామూహిక ఆధ్యాత్మికత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డిగుడిలో నేడు కార్తీక దీపోత్సవం

- గణపురం భక్తుల దృష్టి రెడ్డిగుడిపై
- భక్తిశ్రద్ధలతో దీపాల పర్వదినం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా దీపోత్సవం
- ప్రతీ ఏటా జరిగే పుణ్య పర్వదినం
- సాయంత్రం ఆరు గంటలకు దీపోత్సవం ప్రారంభం
- అలంకారాలతో అందంగా ముస్తాబైన ఆలయం
- భారీగా రానున్న భక్తులు



**గణపురం/నవంబర్4(జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని చారిత్రక వైభవాన్ని సాక్షిగా నిలిపిన కాకతీయుల కలక్షేత్రం ఉత్తర ముఖం దూరమైన శ్రీ నాగలింగేశ్వరాలయం రెడ్డిగుడిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక కాంతుల పర్వదినం ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం దీపోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణం అంతటా దీపాల వెలుగులు పరచడానికి పది వేల మట్టి ప్రమిదలను సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఉదయం నుండి ఆలయ సేవకులు, కమిటీ సభ్యులు గర్భాలయ ప్రాంగణాన్ని పవిత్రంగా శుద్ధి చేసి, ప్రమిదలను వరుసలుగా ఏర్పాటు చేశారు. అనంతరం వాటిలో నూనె నింపే కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు రెండు క్వింటాళ్ల నూనెతో దీపోత్సవ ఏర్పాట్లు కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు భక్తుల సమక్షంలో స్వామివారికి దీపారాధన, భజనమండలీల కార్యక్రమాలతో వేదికను ప్రకాశవంతం చేయనున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ దీపోత్సవం గ్రామ ప్రజల ఆధ్యాత్మిక గర్వకారణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీపోత్సవ సమయానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రహదారి అంచుల్లో విరివిగా దీపాలు వెలిగించి ఆలయ పరిసరాలు పుణ్యక్షేత్ర వాతావరణంలో మునిగిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసరాలన్నీ దీపాల వెలుగులతో మెరవగా, పుణ్యక్షేత్ర వాతావరణం అలుముకుంది. "భక్తులందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా దీపారాధనలో పాల్గొనే సదుపాయాలు కల్పించాం. స్వామివారి ఆశీస్సులు అందరికీ ఆనంద కాంతులు ప్రసాదించాలని కోరుకుంటున్నాం" అని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# జిల్లాలో ట్రైనింగ్ ఐఏఎస్ అధికారుల బృందం పర్యటన

**భూపాలపల్లి/నవంబర్4 (జర్నలిస్ట్ వార్త):**
జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలనా విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సంక్షేమ పథకాల అమలు పరిశీలనకు ట్రైనీ ఐఎఎస్ అధికారుల బృందం జిల్లా పర్యటనకు వస్తున్నందున శాఖల వారిగా సమగ్ర నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.
ట్రైని అధికారుల పర్యటన సందర్భంగా మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య, విద్య, మిషన్ భగీరథ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ట్రైనీ అధికారులు విద్యా, వైద్య, అంగన్ వాడి కేంద్రాలు, స్వయం సహాయక సంఘాలు నిర్వహణ, నర్సరీలు, డంపింగ్ యార్డులు,మిషన్ భగీరథ వంటి పథకాల అమలుపై వివరాలు అందించాలని ఆదేశించారు.



పలిమెల మండలం లెంకల గడ్డ, మహా ముత్తారం మండలం ములుగుపెల్లిలో పంచాయతిలలో పర్యటన ఉంటుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళిక లు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే గ్రామాలలో బస చేయాల్సి ఉంటుందని ప్రాథమిక పాఠశాలలో బస, భోజన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు ముందస్తుగా మండలంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అధికారుల పర్యటనకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు చేయాలని తెలిపారు. రవాణా పర్యవేక్షణ కు లైజనింగ్ అధికారులను నియమించాలని అన్నారు.
ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, కాటారం డిఎస్పి సూర్యనారాయణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిఈఓ రాజేందర్, సంక్షేమ అధికారిని మల్లేశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేత, ఆయా మండలాల తహసిల్దారులు, ఎంపీడీవోలు, సీడీపీఓ తదితరులు పాల్గొన్నారు